సాక్షి
విజయనగరం
శనివారం ౹ 28 ౹ జనవరి ౹ 2023



పోలీసుల సమస్యల పరిష్కారం

విజయనగరం క్రైమ్: పోలీసుల సమస్యల పరిష్కారానికి ప్రతి శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో వెల్ఫేర్‌డే నిర్వహిస్తున్నట్లు ఎస్పీ ఎం.దీపిక తెలిపారు. సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



వేపాడలో కేంద్రబృందం పర్యటన

వేపాడ మండలంలో జాతీయ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనుల నాణ్యత, లబ్ధిదారులకు లబ్ధి తదితర అంశాలపై కేంద్ర బృందం సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు.

- 8లో



జమునక్క మరి లేదు..!

సినీనటి జమున తమ కుటుంబ సభ్యురాలు అని, ఆమెను అక్కా అని పిలిచేవాడినని ప్రముఖ వైద్యుడు, ప్రేమసమాజం అధ్యక్షుడు డాక్టర్ జీఎస్ఆర్ మూర్తి తెలిపారు.

- 8లో

న్యూస్‌రీల్

పరీక్ష పే చర్చకు విశేషస్పందన



గుర్ల మండలం కెల్ల ఉన్నత పాఠశాలలో పరీక్షపే చర్చ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

విజయనగరం ఫూల్‌బాగ్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాఠశాల విద్యార్థులనుద్దేశించి నిర్వహించే పరీక్ష పే చర్చా కార్యక్రమం శుక్రవారం ఉదయం 11 గంటలకు ప్రారంభమైంది. జిల్లా వ్యాప్తంగా 485 పాఠశాలల నుంచి 4,014 మంది ఉపాధ్యాయులు, 48,394 మంది విద్యార్థులు కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ సారి మన జిల్లాకు చెందిన విద్యార్థులకు ప్రధానమంత్రితో మాట్లాడే అవకాశం లభించలేదు.

ఉల్లి రైతుకు ధరల దిగులు



కొనుగోలుదారుల కోసం మార్కెట్లో నిరీక్షిస్తున్న ఉల్లి రైతులు

రామభద్రపురం: రామభద్రపురం అంతరరాష్ట్ర కూరగాయల మార్కెట్లో ఉల్లిపాయల ధర అమాంతం పడిపోయింది. కిలో రూ.10 నుంచి రూ.12 పలుకుతుండడంతో రైతులు దిగులు చెందుతున్నారు. ఆరుగాలం శ్రమించి సాగుచేసిన పంటను దళారులు సిండికేట్‌గా మారి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని ఆవేదన చెందుతున్నారు.

గంజాయితో పట్టుబడిన యువకుడు

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం రైల్వేగేటు వద్ద శుక్రవారం సాయంత్రం పోలీసులు వాహనాలు తనిఖీలు చేస్తుండగా ద్విచక్ర వాహనంపై గంజాయి తరలిస్తున్న యువకుడు పట్టుబడినట్టు తెలిసింది. నాలుగు కేజీల గంజాయి ప్యాకెట్లతో పట్టుబడిన యువకుడుని పోలీస్‌స్టేషన్లో ఉంచి విచారిస్తున్నారు. పూర్తి వివరాలను శనివారం వెల్లడిస్తామని గజపతినగరం సీఐ ఎల్.అప్పలనాయుడు తెలిపారు.

పోలీస్ డైరీ ఆవిష్కరణ



పోలీస్ డైరీని ఆవిష్కరిస్తున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: పోలీస్ సంక్షేమం కోసం కృషిచేస్తున్నామని ఎస్పీ ఎం.దీపిక పేర్కొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా పోలీస్ అసోసియేషన్ రూపొందించిన పోలీస్ డైరీని శుక్రవారం ఆవిష్కరించారు. పోలీస్ సంక్షేమ కార్యక్రమాలతో పాటు, సమగ్ర వివరాలతో కూడిన డైరీని రూపొందించిన అసోసియేషన్ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు నాగేంద్ర, శ్రీను, ఇల్లమాష్, రామకృష్ణ, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రాచీన వాయిద్య పరికరాల సేకరణ



ఎస్.కోట సీతారాంపురంలో పురాతన వాయిద్య పరికరాన్ని పరిశీలిస్తున్న ప్రొఫెసర్ జయధీర్‌తిరుమలరావు

వేపాడ: గిడుగురామ్మూర్తి తెలుగుభాష సేవా జానపద కళాపీఠం అధ్యక్షుడు బద్రి కూర్మారావు, ఆద్యకళా పరిశోధకుడు ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు వేపాడ మండలంలోని ఎస్.కోట సీతారాంపురం గ్రామాన్ని శుక్రవారం సందర్శించారు. ప్రాచీన వాయిద్య పరికరాల గొప్పతనంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. జానపద కళాపీఠం ఆధ్వర్యంలో ఉత్తరాంధ్రలో ఇత్తడి వస్తువులు, ప్రాచీన నాణేలు, రైతులు ఉపయోగించే బుర్ర గిడుగు, ప్రాచీన కత్తులు, వెదురుబుట్టలు, జానపద వాయిద్య పరికరాలు జముకులు, తుడుము, చెక్కబొంగరాలు, దీపపు బుడ్లు, సన్నపకాయలు, తాళపత్ర గ్రంధాలు, పటం కథలు, గిరిజన వాయిద్యాలైన పిన్నెలకర్ర, కిన్నెర, మట్టి పాత్రలు సేకరిస్తున్నామని చెప్పారు. ప్రాచీన వాయిద్య పరికరాలను భవిష్యత్ తరాలకు తెలియజేయాలన్నదే ప్రధాన ఉద్దేశంగా పేర్కొన్నారు. సేకరించిన వస్తువులను ప్రత్యేక మ్యూజియంలో భద్రపరుస్తామని తెలిపారు. కార్యక్రమంలో కళాపీఠం సభ్యుడు పి.సురేష్ పాల్గొన్నారు.

పన్నుల వసూలులో బొబ్బిలి ఫస్ట్

- ఆస్తిపన్ను వసూళ్లపై అధికారుల ప్రత్యేక దృష్టి
- విజయనగరం జిల్లాలో డిమాండ్ రూ.71.99 కోట్లు
- వసూలైనది రూ.29.39 కోట్లు
- గత ఆర్థిక సంవత్సరంతో పోల్చుకుంటే మెరుగుపడిన పన్నుల వసూలు
- 54.20 శాతం వసూళ్లతో మొదటి స్థానంలో నిలిచిన బొబ్బిలి మున్సిపాలిటీ
- 0.92 కోట్ల వసూళ్లతో వెనుకంజలో ఉన్న నెల్లిమర్ల నగర పంచాయతీ

విజయనగరం జిల్లాలో కార్పొరేషన్, మున్సిపాలిటీ, నగర పంచాయతీల్లో 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఆస్తి పన్నుల వసూళ్ల వివరాలు ఇలా...

ప్రాంతం	అసెస్‌మెంట్‌లు	డిమాండ్	వసూళ్లు	శాతం
విజయనగరం	65,231	రూ.59.76కోట్లు	రూ.24.95 కోట్లు	50.10
బొబ్బిలి	12,990	రూ.5.19 కోట్లు	రూ. 2.34 కోట్లు	54.20
రాజాం	11, 651	రూ. 2.59 కోట్లు	రూ.1.17 కోట్లు	54.10
నెల్లిమర్ల	6,407	రూ. 4.45 కోట్లు	రూ.0.92 కోట్లు	24.90
మొత్తం	96,279	రూ.71.99కోట్లు	రూ.29.39 కోట్లు	48.99



విజయనగరంలోని భవన సముదాయాలు

విజయనగరం:

నగరం, పట్టణం, పంచాయతీ... ఇలా ఏ ప్రాంతం అభివృద్ధి చెందాలన్నా... మౌలిక వసతులు కల్పించాలన్నా పన్నుల రూపంలో వచ్చిన ఆదాయమే కీలకం. ఆదాయ వనరులు మెరుగ్గా ఉన్న స్థానిక సంస్థలు ప్రగతిపథంలో పయనిస్తాయి. ఇందులో భాగంగానే పన్నుల రూపంలో రావాల్సిన ఆదాయంపై మున్సిపల్ శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. 2022–23 ఆర్థిక సంవత్సరం మార్చి నాటికి ఆస్తిపన్ను బకాయిలు వసూలు చేసే దిశగా ముందుకు సాగుతున్నారు. మొండి బకాయిల వసూలుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. వసూళ్లలో సచివాలయ యంత్రాంగాన్ని భాగస్వాములను చేస్తున్నారు. పన్నుల బకాయిల వసూళ్లపై ఇప్పటికే ఉద్యోగులకు శిక్షణ ఇచ్చారు. మార్చితో ఆర్థిక సంవత్సరం ముగియనుండడంతో ఈ లోపే లక్ష్యాల సాధనపై గురిపెడుతున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాలోని విజయనగరం కార్పొరేషన్, బొబ్బిలి మున్సిపాలిటీ, నెల్లిమర్ల, రాజాం నగర పంచాయతీల్లో 48.99 శాతం మాత్రమే పన్ను రూపంలో వసూలు చేయగలిగారు. నాలుగింటిలో మొత్తం 96,279 అసెస్‌మెంట్‌లు ఉండగా.. వాటి ద్వారా రూ.71.99 కోట్ల మేర పన్ను డిమాండ్ ఉంది. జనవరి రెండో వారం వరకు రూ.29.39 కోట్లు మాత్రమే వసూలైంది. బకాయిలు వసూలుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.



పన్నుల వసూళ్లలో సచివాలయ కార్యదర్శులు

నోటీసుల జారీ...

స్థానిక సంస్థల్లో అభివృద్ధి పనులు వేగవంతం కావాలంటే పన్నుల రూపంలో రావాల్సిన ఆదాయమే కీలకం. గత రెండేళ్ల కరోనా నేపథ్యంలో చాలా మంది బకాయిదారులు పన్నులు చెల్లించకుండా మొఖం చాటేశారు. దీంతో 2022–23 ఆర్థిక సంవత్సరంలో పాత, కొత్త బకాయిలపై సంబంధిత యజమానులకు అధికారులు నోటీసులు జారీ చేశారు. కేవలం స్థిరాస్తి పన్నులతోపాటు వాణిజ్య బకాయిలు వసూలు చేస్తున్నారు. ఖాళీ స్థలాలు, లే అవుట్లు, ట్రేడ్ లైసెన్సులు, ఇతర అన్ని రకాల పన్నులు నిర్ణీత గడువులోగా వసూలు చేయాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. సచివాలయ కార్యదర్శులకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేయడంతో నేరుగా వారే రంగంలోకి దిగుతున్నారు. పెద్దమొత్తంలో బకాయిలున్న వారి ఇళ్లకు వెళ్లి మాట్లాడుతున్నారు. ప్రతీ డివిజన్‌లోనూ పర్యటించి పన్ను చెల్లింపులపై అవగాహన కల్పించాల్సిన బాధ్యతలను వలంటీర్లకు అప్పగించారు.

గతేడాది కంటే కాస్త మెరుగు

గతేడాది జనవరి నెలాఖరు నాటికి నాలుగు పట్టణాలు/నగరాల్లో కలిపి రూ.18.63 కోట్లు వసూలు చేయగా... ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.29.39 కోట్లు వసూలు చేయగలిగారు. ఈ లెక్కన గత ఆర్థిక సంవత్సరంతో పోల్చుకుంటే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆస్తి పన్నుల వసూళ్లలో రెవెన్యూ విభాగం మెరుగైన ప్రతిభను కనబరుస్తోంది. ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు మరో రెండు నెలలు మాత్రమే గడువు ఉండగా.. వసూళ్ల శాతం ఎంత వరకు పెరుగుతుందో వేచి చూడాల్సి ఉంది. వాస్తవానికి అధికారిక లెక్కల ప్రకారం ఆర్థిక సంవత్సరంలో మొత్తంగా రూ.71.99 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా, అందులో గత ఆర్థిక సంవత్సరాల బకాయిలతో పాటు మొండి బకాయిలు ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

మొండిబకాయిలపై ప్రత్యేక దృష్టి



ఆర్థిక సంవత్సరం ముగింపు సమయం దగ్గరపడుతుండడంతో పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాం. ఇప్పటికే రెవెన్యూ విభాగంలోని ఉద్యోగులతో పాటు సచివాలయ సిబ్బందికి ఆదేశాలు జారీచేశాం. మొండి బకాయిల వసూళ్లపై ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తున్నాం. ప్రధానంగా షాపింగ్ కాంప్లెక్స్‌లు, వాణిజ్య భవనాల నుంచి ఏళ్ల తరబడి పేరుకుపోయిన బకాయిల వసూళ్లకు కృషి చేస్తున్నాం. అవసరమైతే పన్ను చెల్లించని భవనాలను సీజ్ చేసేందుకు వెనుకాడేది లేదు.

– రెడ్డి శ్రీరాములనాయుడు, కమిషనర్, విజయనగరం కార్పొరేషన్

దేవుడిని నమ్మండి.. మంచి జరుగుతుంది

- సినీ హీరో సుమన్



భైరిపురంలో వేంకటేశ్వర స్వామిని దర్శించుకుంటున్న సినీ హీరో సుమన్

మెరకముడిదాం: దేవుడిని నమ్మిన వారికి మంచి జరుగుతుందని సినీ హీరో సుమన్ పేర్కొన్నారు. మెరకముడిదాం మండలం భైరిపురంలో 1777వ సంవత్సరంలో నిర్మించిన పురాతన వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని శుక్రవారం సందర్శించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ భైరిపురం గ్రామానికి చెందిన వెంకటరమణ, తాడ్డి సీతంనాయుడు తనను విశాఖపట్టణంలో కలిసి వేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకోవాలని చెప్పడంతో వచ్చానన్నారు. ఏదైనా ఆలయానికి వెళ్తే ఆ ఆలయ విశిష్టతను తెలుసుకోవాలన్నారు. అనంతరం ఆయనను కలిసిన అభిమానులతో కాసేపు ముచ్చటించారు. తను 700 పైగా సినిమాలలో నటించానని, ఓపిక ఉన్నంత వరకు నటిస్తానన్నారు. అన్నమయ్యలో వేంకటేశ్వరస్వామి పాత్ర చేయడం దేవుడి కృపగా పేర్కొన్నారు. సుమన్‌ను చూసేందుకు గ్రామస్తులు ఎగబడ్డారు.

అక్కా.. ఆరోగ్యం జాగ్రత్త..



- పాలకొండ ఎమ్మెల్యే కళావతికి ఫోన్‌చేసి పరామర్శించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి
- కొద్ది రోజులు విశ్రాంతి తీసుకోవాలని సూచన
- మీకు నేనున్నానంటూ ధైర్యం చెప్పిన ముఖ్యమంత్రి

వీరఘట్టం: ఇటీవల దోనుబాయిలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తీవ్ర అస్వస్థతకు గురైన ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి పాలకొండ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందిన విషయం తెలిసిందే. మీడియా ద్వారా సమాచారం తెలుసుకున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గురువారం రాత్రి 10.30 గంటల సమయంలో ఎమ్మెల్యే కళావతికి నేరుగా ఫోన్‌చేసి మాట్లాడారు. ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకో అక్కా... కొద్ది రోజులు విశ్రాంతి తీసుకోండి... మీకు నేనున్నానంటూ ధైర్యం చెప్పారు. ప్రజల బాగోగులే కాదు, తన వారు కష్టాల్లో ఉంటే వారి కన్నీళ్లు తుడిచి వారికి అండగా నిలిచే మనస్తత్వం ఉన్న వ్యక్తి మన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే కళావతి పేర్కొన్నారు. తన ఆరోగ్యం గూర్చి ఎంతో తపన పడుతూ ముఖ్యమంత్రి ఫోన్‌లో మాట్లాడారన్నారు. ప్రస్తుతం తను విశాఖపట్నంలోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నానని, ఆరోగ్యం బాగానే ఉందని, ఎవరూ ఆందోళన చెందవద్దని కోరారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్



రాష్ట్రస్థాయి ఆహ్వానపు ఖోఖో, కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న నగరమేయర్, తదితరులు

- విజయనగరం కార్పొరేషన్ మేయర్ వెంపడాపు విజయలక్ష్మి
- రాజీవ్ క్రీడామైదానంలో ప్రారంభమైన ఆహ్వానపు ఖోఖో, కబడ్డీ పోటీలు
- రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్న 8 ఖోఖో, 10 కబడ్డీ జట్లు



ఈస్టుగోదావరి- జామి జట్ల మధ్య కబడ్డీ పోటీ

విజయనగరం: క్రీడల్లో రాణించేవారికి ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందని విజయనగరం కార్పొరేషన్ మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అన్నారు. కంచర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు జరగనున్న రాష్ట్రస్థాయి ఆహ్వానపు ఖోఖో, కబడ్డీ పోటీలను రాజీవ్ క్రీడా మైదానంలో శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరంలోని కస్పా స్కూల్‌లో చదివి, క్రీడాకారుడిగా రాణించి, అమెరికాలో స్థిరపడిన కె.కుమార్ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. అనంతరం కంచెర్ల ఫౌండేషన్ సభ్యుడు కె.కుమార్ మాట్లాడుతూ భవిష్యత్ ఇచ్చిన ఊరిలో క్రీడాపోటీలు నిర్వహించాలన్నదే తన ఉద్దేశమన్నారు. క్రీడాకారులకు తనవంత సహకారం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేవతీదేవి, చీఫ్‌కోచ్ అప్పలనాయుడు, కార్పొరేషన్ ఫ్లోర్‌లీడర్ ఎస్‌వీవీ రాజేష్, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, కార్పొరేటర్ కంటుభుక్త తవిటిరాజు, ఖోఖో అసోసియేషన్ చైర్మన్ చిన్నంనాయుడు, కార్యదర్శి సత్యనారాయణ, కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కాళ్ల సూరిబాబు, ఆర్గనైజింగ్ కార్యదర్శి పతివాడ శ్రీనివాసరావు, వ్యాయామ ఉపాధ్యాయులు గోపాల్, బొమ్మన రామారావు తదితరులు పాల్గొన్నారు.

లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో పోటీల నిర్వహణ

ఖోఖో క్రీడాంశంలో విజయనగరం, విశాఖ, శ్రీకాకుళం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణ, ప్రకాశం, నెల్లూరు జట్లు పోటీ పడుతుండగా... కబడ్డీలో ఉత్తరాంధ్ర జిల్లాలైన విజయనగరం, విశాఖపట్టణం, శ్రీకాకుళం జిల్లాల నుంచి 10 జట్లు పాల్గొన్నాయి. శనివారం మధ్యాహ్నం వరకు లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో పోటీలు నిర్వహించి, సెమీఫైనల్స్, ఫైనల్స్ మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. ఈ రెండు క్రీడాంశాల్లో విజేతలుగా నిలిచిన మొదటి జట్టుకు రూ.30వేలు, ద్వితీయ స్థానం దక్కించుకున్న జట్టుకు రూ.20వేలు, తృతీయ, నాల్గవ స్థానాలు దక్కించుకున్న జట్లకు రూ.15వేలు చొప్పున నగదు ప్రోత్సాహకాలు బహూకరిస్తామని నిర్వాహకులు ప్రకటించారు.



హోరాహోరీగా ఖోఖో పోటీ

ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేయండి

- దేవదాయ శాఖ మంత్రిని కోరిన ఎంపీ 'బెల్లాన'



రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రికి నిర్మాణ వివరాలు వెల్లడిస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

చీపురుపల్లి: పట్టణంలో నిర్మాణంలో ఉన్న శ్రీ హరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి దేవదాయ, ధర్మాదాయ శాఖ నుంచి నిధులు మంజూరుచేయాలని ఆ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణను ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ కోరారు. జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కుమార్తె సిరిసహస్ర నిశ్చితార్థ వేడుకలకు హాజరైన రాష్ట్ర మంత్రికు ట్రస్టు సభ్యులతో కలిసి నిధుల అవసరాన్ని వివరించారు. నిర్మాణంలో ఉన్న లయానికి సంబంధించిన ఫొటోలను చూపించారు. రూ.3.5 కోట్లు అంచనా వ్యయంతో అయ్యప్ప ఆలయ నిర్మాణ పనులు ప్రారంభించినట్టు చెప్పారు. ఆలయ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని వార్డు మెంబర్ గంట్యాడ విష్ణు ఇవ్వగా, ఇంతవరకు రూ.50 లక్షల వరకు దాతలు సమకూర్చారన్నారు. దేవదాయ ధర్మాదాయశాఖ నుంచి రూ.కోటి వరకు నిధులు అందించాలని కోరారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో జిల్లా టెలికాం బోర్డు సభ్యుడు ఇప్పిలి తిరుమల, మాజీ వార్డు మెంబర్ పీతల మురళి తదితరులు పాల్గొన్నారు.

డాబాపై డ్రాగన్ తోట

- కోవిడ్ తెచ్చిన కొత్త ఆలోచన
- గతేడాది నుంచి పూత
- వందకుపైగా మొక్కలు
- ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీరు వినూత్న సాగు
- ఆదర్శంగా నిలుస్తున్న సుదర్శనం అధికారి



రెండో అంతస్తుపై డ్రాగన్ తోట



ఒక్కో పిల్లర్ వద్ద ఆరోగ్యకరంగా పెరిగిన మొక్కలు

రాజాం: ఆయనొక సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. వ్యవసాయమంటే మక్కువ. కోవిడ్ సమయంలో తల్లిదండ్రుల సాయంతో విదేశాల్లో బాగా కలిసివస్తున్న డ్రాగన్ పంట సాగుపై దృష్టిసారించాడు. ఆ పంటకు ఇక్కడ ఉన్న డిమాండ్ గుర్తించాడు. వేసిన పంట ద్వారా ఫలసాయం పొందాలని భావించాడు. దీనికోసం ఏకంగా తన ఇంటి డాబానే వ్యవసాయ క్షేత్రంగా మలిచాడు. వందకు పైగా మొక్కలు నాటాడు. సస్యరక్షణ చర్యలు చేపట్టాడు. డ్రాగన్ తోట ఏపుగా పెరిగి దిగుబడి ఆరంభం కావడంతో... కష్టం ఫలించిందంటూ సంబరపడుతున్నాడు. ఆయనే రాజాం పట్టణం పరిధిలోని డోలపేట గ్రామానికి చెందిన సుదర్శనం అధికారి.

ఆరు సెంట్ల విస్తీర్ణంలో...

సుదర్శనం అధికారి విశాఖపట్నంలోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఆయనకు చిన్నప్పటి నుంచి రకరకాల పంటలు సాగుచేయడమంటే ఇష్టం. తల్లిదండ్రులు నర్సమ్మ, శాంతిమూర్తిల ప్రోత్సాహంతో కొంత పొలాన్ని కొనుగోలుచేసి మామిడితోటలు, జీడితోటలతో పాటు పొలాలు, ఇంటి ఆవరణలో వివిధ రకాల మొక్కలు సాగుచేస్తుంటాడు. అదే క్రమంలో కోవిడ్ సమయంలో ఇంటి డాబాపై డ్రాగన్ పంట సాగుకు పూనుకున్నాడు. 25 స్తంభాలు ఏర్పాటుచేసి ఆరుసెంట్లు విస్తీర్ణంలో ఉన్న డాబాపై వందకుపైగా డ్రాగన్ మొక్కలు 2020లో నాటాడు.

గతేడాది జూలై నెల నుంచి కాపు ఆరంభమైంది. ఒక్కో మొక్కకు 12 నుంచి 15 వరకూ డ్రాగన్ పండ్లు దిగుబడి రావడంతో పాటు నాలుగు నెలలు పాటు పూత సాగింది. ఒక్కొక్కటి 800 గ్రాముల నుంచి 900 గ్రాముల బరువు ఉన్న పండ్లు దిగుబడి వస్తున్నాయి. పోషకాలు మెండుగా ఉన్న డ్రాగన్ పండ్ల కొనుగోలుకు ప్రస్తుతం అధికమంది ఆసక్తిచూపుతున్నారు.



డ్రాగన్ మొక్కలకు వేస్తున్న సేంద్రియ ఎరువు

అభిరుచితోనే...



మా ఇంటిపై ఏవో మొక్కలు వేద్దామని అనుకున్నాను. కోవిడ్ సమయంలో వర్క్‌ఫ్రమ్ హోమ్ కావడంతో ఆలోచన వచ్చింది. నెట్‌లో చెక్‌చేసి డ్రాగన్ తోటలుపై దృష్టిసారించారు. ఖమ్మం నర్సరీతో పాటు రేగిడి మండలం కాగితాపల్లి వద్ద దూబ రమేష్ నర్సరీ నుంచి మొక్కలు తెచ్చాం. రూ.2 లక్షలు వెచ్చించి తోట వేశాం. ఇప్పుడు ఇవి అందంగా ఉండడంతో పాటు సీజన్‌లో మంచి పూత వస్తోంది. గతేడాది రూ.1.50 లక్షల వరకు ఆదాయం వచ్చింది.

– సుదర్శనం అధికారి, డోలపేట



పూతకొచ్చిన మొక్కలు

నిరంతరం ఇద్దరు..

పొలం, ఇంటి వద్ద మొక్కల సంరక్షణకు ఇద్దరు రైతు కూలీలను నియమించాడు. ప్రతీ రెండు రోజులకు డ్రాగన్ మొక్కలకు నీరు పెట్టడం, ఏపుగా పెరిగిన కొమ్మలు తొలగించడం, పేడ గత్తం, వేప ఆకులతో సేంద్రియ ఎరువు తయారుచేసి మొక్కలపై పిచికారీ చేయడం వంటి పనులను వారు చక్కబెడుతున్నారు. డ్రాగన్ తోట సాగుతో ఇల్లు కూడా చల్లగా ఉంటోందని ఆయన చెబుతున్నారు.

ఉపాధ్యాయుడిపై వేటు

- 8 మంది ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు

విజయనగరం ఫూల్‌బాగ్/పూసపాటిరేగ: జిల్లా విద్యాశాఖాధికారి బి.లింగేశ్వరరెడ్డి పూసపాటిరేగ మండలంలోని కోనాడ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విధుల్లో అలసత్వం వహించిన ఆ పాఠశాల తెలుగు పండిట్ ఎ.జగదీశ్వరరావును సస్పెండ్ చేశారు. అలాగే, పసపాం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఐ.రాజేశ్వరరావు, కోనాడ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పీవీఎస్ చలంకు ఆర్టికల్ ఆఫ్ చార్జెస్ జారీచేశారు. కోనాడ ఉన్నత పాఠశాల ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్ కె.లక్ష్మణరావు, సోషల్‌స్కూల్ అసిస్టెంట్లు బి.సూరప్పడు, కె.రాధాకృష్ణ, కోనాడ ఎంపీపీఎస్ ఎస్‌జీటీలు సీహెచ్ అప్పారావు, కె.పార్థసారథి, పి.సీతంనాయుడు, పసపాం ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్లు (తెలుగు) కె.సరస్వతి, జి.శ్రీనివాసరావు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు జిల్లా జట్ల ఎంపిక



తైక్వాండో ఎంపిక పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న తైక్వాండో పోటీలకు జిల్లా జట్ల ఎంపికలు పూర్తయ్యాయి. జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని విజ్జీ స్టేడియంలో నిర్వహించిన ఎంపిక పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 200 మందికి పైగా క్రీడాకారులు హాజరుకాగా..వారికి క్యాడెట్, జూనియర్, సీనియర్స్ విభాగాల్లో ఎంపిక నిర్వహించారు. ఆద్యంతంఉత్కంఠ భరితంగా సాగిన ఎంపిక పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈ నెల 29,30,31 తేదీల్లో అనకాపల్లిలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని అసోసియేషన్ అధ్యక్షుడు డీవీ చారి ప్రసాద్ తెలిపారు. ఎంపికలను ఎం.వాగ్దేవి, అనిల్‌కుమార్, రామకృష్ణలు పర్యవేక్షించారు.

అంతర్ విశ్వవిద్యాలయాల బీబీ పోటీలకు జీఎంఆర్ ఐటీ విద్యార్థినులు



పి.అవ్యక్త



డి.శ్రియ

రాజాం సిటీ: స్థానిక జీఎంఆర్ ఐటీ విద్యార్థినులు అంతర్ విశ్వవిద్యాలయాల బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యారని పీడీ బీహెచ్ అరుణ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ఈ పోటీలు ఈ నెల 28 నుంచి చెన్నైలోని బీఎస్ అబ్దుల్ రెహ్మాన్ క్రీసెంట్ ఐటీలో జరగనున్నాయన్నారు. ఇటీవల జీఎంఆర్ ఐటీలో ఈ ఎంపిక పోటీలు నిర్వహించగా పి.అవ్యక్త, డి.శ్రియలు ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థినులను ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్ఎస్‌వీ ప్రసాద్, ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ జె.గిరీష్, స్టూడెంట్ కో ఆర్డినేటర్ డాక్టర్ శశికుమార్‌లతోపాటు విద్యార్థులు అభినందించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పట్టుబడిన ట్రాక్టర్లు

తెర్లాం: ఎటువంటి అనుమతి లేకుండా ఇసుక అక్రమంగా తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను తెర్లాం ఎస్సై ఆర్.రమేష్ శుక్రవారం తెల్లవారు జామున పట్టుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని నాగావళి నది నుంచి ఎటువంటి అనుమతి లేకుండా ఐదు ట్రాక్టర్లపై ఇసుకను వేరే మండలానికి తీసుకువెళ్తున్నారని, సమాచారం రావడంతో పోలీస్‌స్టేషన్ వద్ద వాటిని పట్టుకున్నారు. అనంతరం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కాలిపోయిన ధాన్యం



కాలిపోయిన ధాన్యం చూస్తున్న గ్రామస్తులు

వంగర: మండల పరిధి కొప్పరవలస గ్రామానికి చెందిన రైతు సాదెం సింహాచలంనాయుడి ధాన్యం కాలిపోయాయి. పోలినాయుడువలస సమీపంలో కౌలుకు చేస్తున్న రెండు ఎకరాల పంటను నూర్పు చేసి రాశులుగా ధాన్యం, గడ్డి కుప్పలు కళ్లంలో పెట్టగా గుర్తుతెలియని వ్యక్తులు ధాన్యం కుప్పలకు నిప్పుపెట్టారు. దీంతో పక్కనే ఉన్న ధాన్యంలో కొంతభాగం కాలిపోయాయి. అధికారులు స్పందించి ఆదుకోవాలని రైతు సింహాచలం కోరుతున్నాడు.

వేపాడలో కేంద్రబృందం పర్యటన

వేపాడ: మండలంలో జాతీయ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనుల నాణ్యత, లబ్ధిదారులకు లబ్ధి తదితర అంశాలపై కేంద్ర బృందం సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని వీలుపర్తి, కుమ్మపల్లి పంచాయతీల్లో కేంద్రం నిధులతో చేట్టిన పనులు, నిధులు, లబ్ధిదారులు పొందిన లబ్ధిపై కేంద్రబృందం పరిశీలకులు ఒడిశాకు చెందిన రీసెర్చ్ ఇన్‌ఫర్మేషన్ సెంటర్ అధికారులు గిరిజా శంకర్ పాఢి, సత్య రంజన్ రౌత్ లబ్ధిదారులు, అధికారులను ఆరా తీశారు. వీలుపర్తిలో స్థానిక ఆర్‌సీఎమ్ పాఠశాల ఆవరణలో నిర్వహించిన సమావేశంలో కేంద్ర ఉపాధి నిధులతో గృహనిర్మాణం, డీఆర్‌డీఏ. పంచాయతీ రాజ్, ఐసీడీఎస్‌లకు సంబంధించి ఆయా శాఖాధికారులనుంచి నివేదికలను సేకరించారు. వాటి ఆధారంగా లబ్ధిదారులు పొందిన లబ్ధిపై ఆరాతీసి సమస్యలేమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు.

మామిడి తోటల పరిశీలన

అనంతరం మండలంలోని వీలుపర్తి పంచాయతీలో ఏడువాక నర్సిబాబు హార్టికల్చరల్‌లో సాగుచేస్తున్న మామిడి పంటను పరిశీలించారు. ఎకరా పొలంలో 70 మామిడి మొక్కలు సాగుచేయడాన్ని పరిశీలించి రైతుకు ఏవిధంగా ఉపాధి సొమ్ము ఉపయోగపడుతోందని ఆరాతీశారు. అలాగే వీలుపర్తి పంచాయతీ రాయుడుపేటలో బంగారు రమణ మామిడి తోట చుట్టూ బౌండరీ ట్రెంచ్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపీడీఓ పట్నాయక్ ఆధ్వర్యంలో జరిగిన కేంద్ర బృందం పరిశీలనలో డీఆర్‌డీఏ డీపీఎం ఎం.ఆదయ్య, ఐకేపీ కో.ఆర్డినేటర్ జయశ్రీ, ఐసీడీఎస్ పీఓ ఉమాదేవి, గృహనిర్మాణశాఖ డీఈ శ్రీనివాసన్ ఏపీడీ శారదాదేవి, ఈటీపీఆర్‌డీ సూర్యనారాయణ, వీలుపర్తి, కుమ్మపల్లి గ్రామసర్పంచ్‌లు శానాపతి లీలా, నౌడు అరుణ తదితర మండలస్థాయి అధికారులు, ఉపాధి టీఏలు, ఈసీలు పాల్గొన్నారు.



వీలుపర్తిలో కేంద్రం నిధులతో చేపట్టిన పనులు, నిధులపై శాఖలవారీగా నివేదికలు సేకరిస్తున్న కేంద్ర పరిశీలకులు

విస్తరిస్తున్న సీఓపీడీ కేసులు



సీఓపీడీ వ్యాధిగ్రస్తుడిని పరీక్షిస్తున్న వైద్యుడు

విజయనగరం ఫోర్ట్: భయంకరమైన హెచ్‌ఐవీ, క్షయ, కుష్టు వ్యాధుల వ్యాప్తి గతంలో ఎక్కువగా ఉండేది. రెండేళ్ల క్రితం కోవిడ్ మహమ్మారి విలయతాండవం చేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింది. తాజాగా సీఓపీడీ (క్రానిక్ అబస్ట్రాకెల్ పలమనరీ డీసీజ్) వ్యాధి అధికంగా ఉంది. జిల్లాలో వేలాది మంది ఈవ్యాధితో బాధపడుతున్నారు. ప్రపంచంలోనే మూడో ప్రాణంతక వ్యాధిగా దీన్ని పరిగణిస్తున్నారు.

పొగ తాగడం, పీల్చడం వల్ల వ్యాధి సంక్రమణ

పొగ తాగడం, పొగ తాగే వ్యక్తి పక్కనుండి పీల్చడం వల్ల సీఓపీడీ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. ఈ వ్యాధి సోకితే అది గుండెపై కూడా ప్రభావం చూపుతుంది. గోధుమ రంగులో కఫం పడడం, ఆయాసం, దగ్గు వ్యాధి లక్షణాలు. వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స తీసుకోవడంలో జాప్యం జరిగితే కుడివైపు గుండె సాగి ప్రాణాల మీదకు వస్తుంది. ఒకసారి వ్యాధి సోకితే జీవితాంతం చికిత్స తీసుకోవాల్సిందే. సీఓపీడీ సోకిన వారు సకాలంలో వైద్యుడిని సంప్రదించి చికిత్స తీసుకోవాలి. ఊపిరితిత్తులు పూర్తిగా పాడైన తర్వాత ఆక్సిజన్ పెడితేగాని శ్వాస ఆడని పరిస్థితి.

జిల్లాలో 40 శాతానికి పైగా వ్యాప్తి

సీఓపీడీ వ్యాధితో జిల్లాలో 40 శాతానికి పైగా ప్రజలు బాధపడుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఇంతవరకు పలమనాలజీ సేవలు అందుబాటులో లేక పోవడం వల్ల ఈవ్యాధి గుర్తింపు పెద్దగా జరగలేదు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ప్రస్తుతం పలమనాలజీ సేవలు అందుబాటులోకి రావడంతో వ్యాధిగ్రస్తులను గుర్తిస్తున్నారు. దగ్గు, ఆయాసంతో ఆస్పత్రికి వచ్చిన ప్రతి 10 మందిలో 8 మందికి సీఓపీడీగా నిర్ధారణ అవుతోంది.

పొగతాగడం పూర్తిగా ఆపేయాలి



సీఓపీడీ వ్యాధి బారిన పడకుండా ఉండాలంటే పొగ తాగడం పూర్తిగా మానివేయాలి. అదేవిధంగా పొగ తాగే వారి పక్కన కూడా ఉండకూడదు. సకాలంలో వైద్యం చేయించుకోవాలి. సీఓపీడీ ప్రాణంతకమైన వ్యాధి. జిల్లాలో అధికంగా కేసులు వస్తున్నాయి.

డాక్టర్ బొత్స సంతోష్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

సెల్‌ఫోన్ లాక్కున్న నిందితుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు(వెనుక ముసుగులో నిందితుడు)

విజయనగరం క్రైమ్: కత్తితో బెదిరించి సెల్‌ఫోన్ లాక్కెళ్లిన నిందితులను వన్‌టౌన్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఈ మేరకు సీఐ బి.వెంకటరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక బాలాజీ కూడలి వద్ద ఈ నెల 21న అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో ముగ్గురు దుండగులు అడ్డుకుని కత్తులతో బెదిరించి, సెల్‌ఫోన్ లాక్కెళ్లినట్లు కొత్తపేటకు చెందిన రెడ్డి సన్యాసిరావు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు శుక్రవారం ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ వద్ద స్కూటీపై అనుమానాస్పదంగా తిరుగుతున్న విజయనగరంలోని మంగలివీధికి చెందిన షేక్‌హుస్సేన్, మరో ఇద్దరు జువైనల్స్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. దీంతో నిందితులు నేరాన్ని అంగీకరించారు. అనంతరం నిందితుడి దగ్గర నుంచి ఒక సెల్‌ఫోన్, రెండు కత్తులు, స్కూటీని స్వాధీనం చేసుకుని, రిమాండ్‌కు తరలించారు. ఇద్దరు జువైనల్స్‌ను జువైనల్ హోమ్‌కి తరలించినట్లు తెలిపారు.

ఆర్‌సెట్‌లో రాణించిన విజయలక్ష్మి



విజయలక్ష్మి

శృంగవరపుకోట: ఆంధ్రప్రదేశ్ రీసెర్చ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌లో పట్టణానికి చెందిన యేడువాక విజయలక్ష్మి సత్తా చాటింది. ఆంధ్రవిశ్వ విద్యాలయం చరిత్ర విభాగంలో కేటాయించిన ఒక్కటే పార్ట్ టైమ్ సీటును విజయలక్ష్మి సాధించారు. గతంలో ఆమె పీహెచ్‌డీకి అర్హత సాధించినప్పటికి అరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒప్పంద అధ్యాపకురాలిగా పనిచేయడంతో వీలుకాక వెళ్లలేదు. గత ఏడాది జిల్లా ఉత్తమ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారిగా ఆంధ్రా యూనివర్సిటీ పురస్కారం సాధించిన విజయలక్ష్మి, జిల్లా, రాష్ట్రస్థాయిలో పలు యువ నాయకత్వ పురస్కారాలను భారత ప్రభుత్వం నుంచి సాధించారు. ప్రస్తుతం ఆంధ్రా విశ్వవిద్యాలయంలో ఉన్న ఒక్క సీటును గట్టి పోటీ మధ్య ఆమె సాధించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

సారా నిషేధానికి తీర్మానం



గ్రామంలో నిర్వహిస్తున్న సమావేశం

సాలూరు: దశలవారీగా మద్యపాన నిషేధం దిశగా అడుగులు వేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా మరిపల్లి గ్రామస్తులు నడుంబిగించారు. ఈ మేరకు శుక్రవారం రాత్రి గ్రామంలో పెద్దల ఆధ్వర్యంలో ప్రజలంతా సమావేశమై చర్చించారు. ఈ క్రమంలో గ్రామంలో సారా అమ్మరాదని అలా అమ్మినట్లయితే ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు వారికి అమలుచేయరాదని కోరతామని, అంతేకాక సారా విక్రయిస్తూ మొదటిసారి దొరికితే రూ.పదివేల జరిమానా, పోలీసుకేసు, రెండవ సారి దొరికితే పీడీ యాక్ట్ నమోదు చేయాలని కోరతామని గ్రామస్తులంతా తీర్మానించారు. అందరం ఐక్యంగా ఉండి సారా నిర్మూలనకు కృషి చేయాలని చర్చించుకున్నారు.

పట్టణ ప్రాంతాల్లో గోధుమ పిండి పంపిణీ

పార్వతీపురం: పట్టణ ప్రాంతాల్లో గోధుమ పిండి పంపిణీ చేయాలని పార్వతీపురం మన్యం జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులను జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్ ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పట్టణ ప్రాంతాల్లో రేషన్ కార్డుదారులకు ఫిబ్రవరి నెల నుంచి గోధుమ పిండి పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించిన మేరకు జిల్లాలోని పార్వతీపురం, సాలూరు, పాలకొండ మున్సిపాలిటీలలో కార్డుదారులకు నెలకు రెండు కిలోల పిండిని కిలో రూ.16 చొప్పున అందించాలని పేర్కొన్నారు. పీడీఎస్ కార్డుదారులకు రేషన్ వాహనం ద్వారా కందిపప్పు, పంచదార పంపిణీ చేస్తామని కార్డుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ సూచించారు.

బస్సు ఢీకొని యాచకుడి మృతి



బస్సును ఢీకొని చనిపోయిన యాచకుడు అప్పారావు

శృంగవరపుకోట: స్థానిక దేవీ జంక్షన్ వద్ద శుక్రవారం ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఓ యాచకుడు మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. కించుమండ నుంచి విశాఖ వెళ్తున్న ఎస్.కోట డిపో ఆర్టీసీ బస్ స్థానిక దేవీ జంక్షన్‌కు వస్తున్న సమయంలో యాచకుడు అప్పారావు (70) రోడ్డు దాటుతూ బస్ ముందు భాగంలో ఢీకొన్నాడు. దీంతో తీవ్రంగా గాయపడిన యాచకుడిని హుటాహుటిన స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. అప్పారావు గతంలో విశాఖ జిల్లాలోని చిలకలగెడ్డ గ్రామంలో ఇటుకల బట్టీలో పని చేసేవాడని, తర్వాత ఎస్.కోటలో అప్పన్న హోటల్‌లో సర్వర్‌గా కొంత కాలం పనిచేశాడని తెలిసింది. కొంతకాలంగా యాచిస్తూ, జీవనం సాగిస్తున్నాడు. ప్రమాదం జరిగిన సమయంలో అప్పారావు పూటుగా మద్యం తాగి ఉన్నాడని వైద్యులు నిర్ధారించారు. మద్యం మత్తులో హఠాత్తుగా బస్సును ఢీకొన్నాడని డిపో మేనేజర్ కె.రమేష్ చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌కోట ఎస్సై తారకేశ్వరరావు చెప్పారు.

ఆటోను లారీ ఢీకొని ఐదుగురికి తీవ్ర గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

బొబ్బిలి రూరల్: పట్టణంలోని ఐటీఐకాలనీ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. రామభద్రపురం మండలం కొండకెంగువకు చెందిన 8మంది బొబ్బిలి మండలం అలజంగిలో ఓ వివాహానికి హాజరై తిరుగుప్రయాణంలో ఆటోలో స్వగ్రామం వస్తుండగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతోజరిగిన ప్రమాదంలో అంపోలు హేమలత, బంగారులక్ష్మి, కృష్ణమ్మ, ధనలక్ష్మిలతో పాటు బెవర రవి గాయపడ్డారు. క్షతగాత్రులను సీహెచ్‌సీకి తరలించగా, వైద్యులు ప్రథమచికిత్స చేసిన అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయనగరం తరలించారు. అదే ఆటోలో ప్రయాణిస్తున్న మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులుకేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ ఢీకొని వృద్ధుడికి..

రాజాం సిటీ: స్థానిక మెయిన్ రోడ్డులో బైక్ ఢీకొనడంతో ఓవృద్ధుడు గాయపడినట్లు సీఐ కె.రవికుమార్ శుక్రవారం తెలిపారు. ఈ నెల 26న తెలగవీధికి చెందిన వృద్ధుడు ముంజేటి రాజయ్య రోడ్డు దాటుతుండగా ద్విచక్రవాహనం ఢీకొంది. దీంతో గాయాల పాలైన రాజయ్యను స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందించారు. వృద్ధుడి మనుమడు రాజేష్ ఫిర్యాదు మేరకు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

భూ పంపిణీకి ప్రతిపాదనలు పంపాలి

- జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు



మాట్లాడుతున్న డీఆర్‌ఓ ఎం.గణపతిరావు

విజయనగరం అర్బన్: పేదలు సాగుచేసుకుంటున్న వ్యవసాయ భూములకు సంబంధించి పట్టాల పంపిణీకి తహసీల్దార్లు వెంటనే ప్రతిపాదనలు పంపించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు కోరారు. భూ పంపిణీకి వచ్చిన ప్రతిపాదనలపై తన చాంబర్‌లో మండలాల వారీగా ఆయన శుక్రవారం సమీక్షించారు. ప్రతి తహసీల్దార్ వారి మండలానికి ఇచ్చిన లక్ష్యం మేరకు వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేసి అందజేయాలని ఆదేశించారు. లోకాయుక్త కేసులకు సంబంధించి వివిధ శాఖల వారీగా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయా శాఖల అధికారులతో కేసుల గురించి వివరింగా చర్చించారు. లోకాయుక్త కేసులకు సంబంధించి, సమగ్ర వివరాలతో వారం రోజుల్లో నివేదికలను పంపించాలని ఆదేశించారు. ఇలాంటి విషయాల్లో జాప్యం చేస్తే తరువాత ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో కలెక్టరేట్ ఏఓ శ్రీకాంత్, ఆయా శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఆదర్శ విద్యార్థులు



వేపాడ: ప్రకాష్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు



గంట్యాడ: విద్యార్థి దేవిశ్రీ ప్రసాత్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రామకృష్ణారావు

వేపాడ/గంట్యాడ: వేపాడ మండలం బక్కునాయుడుపేట ఆదర్శ కళాశాలలో ఇంటర్‌మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎం.ప్రకాష్, గంట్యాడ మండలంలోని మోడల్ స్కూల్ విద్యార్థి పి.దేవిశ్రీ ప్రసాద్, జాతీయ స్థాయి కబాడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్స్ తెలిపారు. రాష్ట్ర స్కూల్ గేమ్స్‌లో భాగంగా అండర్17 విభాగంలో ఈ నెల 23 నుంచి 25వరకు నెల్లిమర్ల మండలంలోని అలుగోలులో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో మోడల్ స్కూల్స్ విద్యార్థులు ప్రతిభ చాటి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు ఆ విద్యార్థులను అభినందించారు.

యూత్ పార్లమెంట్ రాష్ట్రస్థాయికి నలుగురి ఎంపిక



యూత్ పార్లమెంట్-2023 పోటీలకు విద్యార్థుల ఎంపిక నిర్వహిస్తున్న జ్యూరీ సభ్యులు



వర్చువల్ విధానంలో మాట్లాడుతున్న విద్యార్థులు

విజయనగరం: మార్చి 23, 24వ తేదీల్లో ఢిల్లీ వేదికగా జరగనున్న యూత్ పార్లమెంట్ - 2023 వేడుకల్లో భాగంగా విజయనగరం నెహ్రూ యువ కేంద్రం వేదికగా ప్రాంతీయస్థాయి ఎంపికలు జరిగాయి. అందులో భాగంగా ఏడు జిల్లాల నుంచి సుమారు 70 మంది పాల్గొనగా ప్రతి జిల్లా నుంచి ఇద్దరేసి చొప్పున 14 మందిని రాష్ట్రస్థాయి పోటీలకు జ్యూరీ సభ్యులు ఎంపిక చేశారు. ఈ మేరకు ఉమ్మడి విజయనగరం జిల్లానుంచి అన్నాబత్తుల ఇందు జాహ్నవి, కిల్లాన సాయిస్వరూప్, నీల అనూష, సీరా ముత్య మేఘన రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు జిల్లా యువజన అధికారి జి. విక్రమాదిత్య వెల్లడించారు. వారందరికీ ఫిబ్రవరి తొలి వారం నుంచి రాష్ట్రస్థాయిలో ఎంపిక పోటీలు ఉంటాయని అందులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారు జాతీయస్థాయికి ఎంపికవుతారని వివరించారు. ఎంపిక ప్రక్రియలో పాల్గొన్న 70 మంది విద్యార్థులు కోస్తాంధ్ర పరిధిలోని విజయనగరం, పార్వతీపురం, కోనసీమ, కాకినాడ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాలకు చెందిన సుమారు 70 మంది యువత ఈ ఎంపిక ప్రక్రియలో పాల్గొన్నారు. న్యాయ నిర్ణేతలుగా జ్యూరీ ప్యానెల్ సభ్యులు డాక్టర్ పీఏబీఎస్ఎస్. శర్మ, డాక్టర్ బి.నళిని, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్.షణ్ముఖ రావు, సామాజిక కార్యకర్త సీహెచ్. ఈశ్వరరావు, ఏపీఆర్వో డి.నారాయణరావు వ్యవహరించారు. కార్యక్రమంలో కోస్తాంధ్ర పరిధిలోని జిల్లాలకు చెందిన యువజన అధికారులు విక్రమాదిత్య, అమృతేశ్, కిశోర్, స్థానిక యువజన కార్యాలయ ఏవో పృథ్వీ పాల్గొన్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 547.00
శ్రీకాకుళం	రూ. 551.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	54,930–00
బంగారం(22సి. 10గ్రా.)	50,350–00
వెండి (కిలో)	74,500–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹115	₹200	₹ 210

జమునక్క మరి లేదు..!

- డాక్టర్ బీఎస్ఆర్ మూర్తి



జమునకు మెమెంటో అందజేస్తున్న డాక్టర్ బీఎస్ఆర్ మూర్తి

విజయనగరం టౌన్: సినీనటి జమున తమ కుటుంబ సభ్యురాలు అని, ఆమెను అక్కా అని పిలిచేవాడినని ప్రముఖ వైద్యుడు, ప్రేమసమాజం అధ్యక్షుడు డాక్టర్ బీఎస్ఆర్ మూర్తి తెలిపారు. తన కుమార్తె వంశీపావని పెళ్లికి జమున రావడంతో పాటు పెళ్లి పనులలో పాల్గొనడం, తన షష్టిపూర్తి మహోత్సవానికి హాజరు కావడం మరిచిపోలేనివని చెప్పారు. అటువంటి జమున అక్కను కోల్పోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. జమునకు జిల్లాతోను, తమ కుటుంబంతోను గల అనుబంధంపై సాక్షికి ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

విజయనగరంతో ఎనలేని బంధం

సినీనటి జమునకు విజయనగరం జిల్లాతో మంచి అనుబంధం ఉంది. వృత్తి కళాకారుల అభ్యున్నతికి ఆమె కృషి చేశారు. జిల్లాలోని బొబ్బిలిలో 20 ఏళ్ల క్రితం కళాకారులు నిర్వహించిన కార్యక్రమానికి ఆమె వచ్చిన సందర్భంగా గజపతినగరంలో నివాసం ఉంటున్న డాక్టర్ బీఎస్ఆర్ మూర్తిని కలిశారు. చిన్న తమ్ముడు అంటూ ఆప్యాయంగా పలకరించేవారు. విజయనగరంలోని ప్రేమసమాజాన్ని పలుమార్లు సందర్శించి, వృద్ధులతో మమేకమయ్యేవారు. ఆంధ్రప్రదేశ్ వృత్తి కళాకారుల సమాఖ్య స్థాపించి అధ్యక్షురాలిగా వ్యవహరించారు. ఆ సమాఖ్యకు గౌరవ సలహాదారుగా బీఎస్ఆర్ మూర్తి ఉన్నారు. ఆమె రాష్ట్ర నాటక అకాడమీ అధ్యక్షురాలిగా ఉన్న సమయంలో 40 మంది కళాకారులకు పెన్షన్ అందించారు. 'డాక్టర్ మమత' పేరుతో 13 ఎపిసోడ్ల సీరియల్ షూటింగ్‌ను నెలరోజుల పాటు జిల్లాలోనే ఉండి చేశారు. ఆ సమయంలో బీఎస్ఆర్ మూర్తి ఇంట్లోనే జమున ఉండేవారు. విజయనగరంలోని మహారాజా సంగీత, నృత్య కళాశాలలో ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనేవారు. కాంగ్రెస్ పార్టీ ప్రచారం నిమిత్తం బీఎస్ఆర్ మూర్తి చొరవతో విజయనగరం జిల్లాకు వచ్చి ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు.



1993లో జమునతో సత్కారం అందుకుంటున్న రంగస్థల నటుల సంఘం కార్యదర్శి రాంబార్కి లక్ష్మీనాథ్



1993లో బొబ్బిలి వచ్చిన జమునతో ఆనాటి స్థానిక మహిళలు